49

## నా రాధకు...



**రాధ, నీ జపం, తపం**
**ధ్యానం, గానం**
**అన్నీ నేనైతే**
**ఇక నీలో నీవెక్కడే?**
**అంతా నేనేగా...!!**

** *** **

నీ వలపు కన్నుల్లో ప్రేమసాగరం
ఉప్పొంగిపోతుంటే
నిన్ను అక్కున చేర్చుకుని
అదుపు చేశా-

** *** **

**నీ జీవితంలో ఓ రోజు**
**చంద్రోదయమైందన్నావు**
**వేడివెన్నెల పంటగా నేను నిన్ను**
**అనుగ్రహించిన రోజేనా అది-**

** *** **

రాలే ఆకు రాగాలలో
పూసే పూల గంధాలలో
రాధ ఆమని అంతటా నీవే-

** *** **

**నా వేణువులో ఏముంది శూన్యం**
**అందులోకి స్వరమై నీవొస్తేనేగా-**

** *** **

రాధ, దేవుడు దీవించి నిన్ను
చేరుకొమ్మన్నాడు
నీవు కర్తవ్యం బోధిస్తే
సాగిపొమ్మన్నాడు

**- చల్లా రామక్రిష్ణారెడ్డి**



# ఇది అది కాదు!



**హరనాథ్**

ఢిల్లీ!

పాలికా బజార్‌లో చూశా!

తాజ్‌మహల్.. ట్రాన్స్‌పరెంట్ అద్దాలతో చేశారుదాన్ని. చిన్న టివి అంత ఉంది అది. అన్ని వేలమంది ఒకర్నొకరు తోసుకుంటూ, రాసుకుంటూ తిరుగాడే అండర్‌గ్రౌండ్ పాలికా బజార్ ఇరుకైన వరండాలో కూడా ఆ తాజ్ బొమ్మ చూసి కదల్లేకపోయా. దాన్ని చూపి వచ్చీరాని హిందీలో అడిగా ధర. వెయ్యి రూపాయలు చెప్పాడు. నా దగ్గరున్నవి పదిహేను వందలే. హైదరాబాద్‌కి తిరుగు టిక్కెట్టు రిజర్వ్ అయిపోయిందిగానీ ఈ బొమ్మ కొంటే ఇక చేతిలో మిగిలేవి ఐదు వందలే. ఎపి ఎక్స్‌ప్రెస్‌లో ఒక రోజు ప్రయాణం. మళ్ళీ ఇపుడు ఎపి భవన్‌కి వెళ్ళి సామాను సర్దుకుని రైల్వేస్టేషన్‌కి వెళ్ళాలి. ఐదు వందలు మిగుల్తాయి కాబట్టి పర్వాలేదు గానీ...

ఇది పట్టుకెళ్ళడం ఎలా?

నా బ్యాగ్‌లో పెట్టే వస్తువు కాదిది. పగిలిపోతుంది. పైగా పట్టదు కూడా. అలాగే ప్యాక్ చేసుకునితీసుకుపోవాలి. ఎక్కడ పెట్టడానికీ ఉండదు. అసలే గాజుది. చిన్న ఒత్తిడికైనా పగిలిపోతుంది. మరి ఎలా?

'ఛ. వద్దులే, తీరా ప్రయాణంలో పగిలిపోతే వెయ్యి రూపాయిలూ దండుగే. పైగా పిల్లలకి ఏం తీసుకు వెళ్ళడానికీ ఉండదు కూడా'- అనుకుని వెనుదిరగబోయాను. కాని...

ఒక్కసారి తల తిప్పి మళ్ళీ షోకేస్ కేసి చూశాను...

తాజ్ మహల్! నిన్న మేం ఆగ్రాలో చూసినదానికి ప్రతి రూపం. మంచులా మెరిసి పోతోంది.

తాజ్‌మహల్ ప్రేమకి చిహ్నం!

ముంతాజ్‌పట్ల ప్రేమకుగుర్తుగా షాజహాన్ చక్రవర్తి కట్టించిన స్మారక చిహ్నం. ప్రేయసీ ప్రియులకీ, భార్యాభర్తల అనుబంధానికీ, పవిత్ర స్నేహానికీ కూడా చిహ్నం అది!

కాళ్ళు మొరాయించాయి. కళ్ళు షోకేస్‌లో ఇరుక్కుపోయాయి. మనసు అక్కడే అంటుకుపోయింది. బుద్ధి ఆజ్ఞల్ని శరీరం పాటించడం లేదు.

ఎలా మరి?

చేత్తోనే పట్టుకుని తీసుకుపోనా?...

మంచి ఆలోచన! ఇంత గొప్ప తాజ్‌మహల్ కోసం ఒక్కరోజు రైల్లో దాన్ని చేతుల్తో పట్టుకునే కూచోలేనా?

సరే! తక్షణం ఇంక వేరే ఆలోచన వచ్చేలోగానే అది కొని అపురూపంగా చేత్తో పట్టుకుని వేలాది మంది జనాల మధ్య నుండి ఒదిగి ఒదిగిపోతూ, ఎవరూ తాజ్‌కి తగల కుండా, ఆ బజార్ నుండి బయట పడటానికే తల ప్రాణం తోకకి వచ్చింది.

ఆటో ఎక్కి ఆంధ్రా భవన్‌కి!

మూడో అంతస్తుకి లిఫ్ట్ ఎక్కి వెళ్ళి, అక్కడ రూం తలుపు తెరిచి, అప్పుడు పెట్టాను టేబుల్ మీద!

చేతులు గుంజుకుపోతున్నాయి. అబ్బా! ఎలా తేగలిగాను!

ఇక సామాను సర్దుకోవడం. కిందకి వెళ్ళి క్యాంటిన్‌లో భోజనం. టైమ్ అయిపోతోంది రైలుకి! హడావుడి. ఉరుకులు పరుగులు! మరో ఇరవై నిముషాల్లో ఒక చేత్తో బ్యాగ్, మరో చేతిలో పాత న్యూస్ పేపర్‌తో ప్యాక్ చేసిన తాజ్‌తో ఆటో కోసం ఎపి భవన్ ముందు నిలబడ్డా! ఆటో ఎక్కి ఢిల్లీ రైల్వే స్టేషన్ చేరా!

అబ్బా! జనం. పాలికా బజారే నయమేమో! తోసుకుంటూ, నెట్టుకుంటూ జనం ముందు నించీ వెనుక నించీ వెడుతూంటే గుండెలు దడదడ మంటున్నాయి. చేతిలో తాజ్‌ని భద్రంగా పట్టుకోవడానికే నా సర్వశక్తులూ సరిపోతున్నాయి.

చివరికి ఎపి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫాం పైకి వచ్చేవరకూ నిలబడే ఉండటం. చేతిలో తాజ్‌ని కిందికి దింపడానికి లేదు. ఎవరైనా తన్నెయ్యచ్చు! లేదా ఏదైనా తగలచ్చు.

రైలు రావడంతోనే వందలాది మంది ఎగబడ్డారు. వాళ్ళని నెట్టుకుని చోటుచేసుకుని తాజ్‌తో కూడా లోపలికి బెర్త్ దాకా పోవడం ఎలా?

అది ఎలా జరిగిందో, ఎంతసేపు పట్టిందో చెప్పలేను. చివరికి సీట్లో కూలబడ్డాక కూడా... తాజ్‌ని దింపేందుకు లేదు. ఒళ్ళో పెట్టుకునే....

రాత్రి భోజనమూ అలాగే సాగింది. పడక కూడా తాజ్‌ని డొక్కలో పెట్టుకునే!

సికిందరాబాద్‌లో దిగి జన సముద్రం మధ్యలో తాజ్‌ని ఎత్తి పట్టి ఈదుకుంటూ ఆటో ఎక్కాక మరో సమస్య. హైదరాబాద్ ట్రాఫిక్‌లో, ఈ రోడ్లపై అది నా ఒళ్ళోనే పగుల్తుందేమో అన్న భయం!

నిద్ర లేకపోవడం వల్ల ఒకటే మగత!

రాం నగర్ వచ్చాక ఆపాడు ఆటో!

ఉలికిపడి బాగ్ పుచ్చుకుని తాజ్ నెత్తుకుని ఆటో దిగుతూండగానే....

చేతిలోంచి జారడం...

భళ్ళున గాజు పగిలిన చప్పుడు హృదయ విదారకంగా చెవుల్ని చీల్చడం...

గాజుపెంకు కాల్లో గుచ్చుకుంది. కాలు ఈడ్చుకుంటూ మిగిలిన బ్యాగ్ మోసుకుంటూ రెండంతస్తుల మెట్లు ఎక్కుతూ...

కాలు మంటగా ఉంది. అప్పటిదాకా తాజ్‌ని మోసిన చెయ్యి ఖాళీ అయిన ఉపశమనం కూడా తెలియడం లేదు. మనసులో ఏదో వెలితి, అసంతృప్తి.....

తాజ్ ప్రేమకి కాదు చిహ్నం,
తాజ్ అనుబంధానికి కాదు చిహ్నం,
తాజ్ స్నేహానికి కాదు చిహ్నం,
తాజ్.... ఎడబాటుకి,
దూరానికీ మాత్రమే చిహ్నం!